క్లుప్తంగా

గంధోత్సవంలో ఆర్టీసీ వైస్ చైర్మన్



గంధోత్సవంలో విజయానందరెడ్డి

చిత్తూరు రూరల్: చిత్తూరు నగరం దర్గా సర్కిల్‌లోని రసూల్ బాబా దర్గాలో ఆదివారం గంధోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. వేడుకలకు ఆర్టీసీ వైస్ చైర్మన్ విజయానందరెడ్డి హాజరయ్యారు. ప్రత్యేక ప్రార్థనలు చేశారు. కోఆప్షన్ మెంబర్ అను పాల్గొన్నారు.

గోసంరక్షణ ట్రస్ట్‌కు రూ.1.50 లక్షల విరాళం



విరాళాన్ని అందజేస్తున్న దాతలు

కాణిపాకం(యాదమరి): కాణిపాక వరసిద్ధి వినాయకస్వామి గోసంరక్షణ ట్రస్ట్‌కు రూ.1.50 లక్షల బెంగళూరుకు చెందిన జయ ప్రకాష్ కుటుంబసభ్యులు ఆలయ అధికారులకు అందజేశారు. ఆదివారం దాత కుటుంబ సభ్యులు స్వామివారి దర్శనార్థం విచ్చేసి స్వామివారి గోసంరక్షణ ట్రస్ట్‌కు విరాళం అందించారు. వారికి ఆలయ అధికారులు స్వామివారి ప్రత్యేక దర్శనం కల్పించి, స్వామివారి తీర్థ ప్రసాదాలు అందించారు. టెంపుల్ ఇన్‌స్పెక్టర్‌బాబు పాల్గొన్నారు.

ధ్యాన సాధనతోనే జ్ఞానం



ప్రసంగిస్తున్న మాస్టర్ నరేంద్ర

తవణంపల్లె: ధ్యాన సాధన పెంచుకునే కొద్దీ జ్ఞానం పెరుగుతుందని హైదరాబాద్ సీనియర్ పిరమిడ్ మాస్టర్ నరేంద్ర తెలిపారు. ఆదివారం సిద్ధంపల్లె సమీపంలోని విఘ్నేశ్వర పిరమిడ్ మహాశక్తి క్షేత్రంలో ఆధ్యాత్మిక సదస్సు నిర్వహించారు. సీనియర్ పిరమిడ్ మాస్టర్ నరేంద్ర ప్రసంగిస్తూ పితామహ పత్రీజీ స్ఫూర్తితో ఆయన నేర్చుకున్న జ్ఞానాన్ని అందరికీ పంచానని అన్నారు. అన్ని సమస్యలకు ఏకైక మార్గం ధ్యానమని సూచించారు. విధిరాతను సైతం మార్చుకునే శక్తి ధ్యానానికి ఉందన్నారు. అనంతరం నరేంద్రను జిల్లా పిరమిడ్ స్పిరిచ్యువల్ సొసైటీ, గ్లోబల్ స్పిరిచ్యువల్ ట్రస్ట్ వ్యవస్థాపక అధ్యక్షుడు డాక్టర్ బి. గోపాలకృష్ణమూర్తి, కన్వీనర్ రాధిక, ధ్యానులు పాల్గొన్నారు.

హాఫ్ మారథాన్‌లో రాణించిన ఎస్‌ఐ



పతకంతో రామకృష్ణ

చిత్తూరు అర్బన్: చిత్తూరు పోలీసుశాఖలో ఎస్‌ఐగా విధులు నిర్వర్తిస్తున్న రామకృష్ణ హాఫ్ మారథాన్‌లో మరోమారు రాణించారు. ఆదివారం హైదరాబాద్‌లో నేషనల్ మినరల్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ (ఎన్ఎండీసీ) ఆధ్వర్యంలో హాఫ్ మారథాన్ (21.1కి.మీ) నిర్వహించారు. దీన్ని 1.43 గంటల్లో పూర్తిచేశారు. ఇప్పటికే దేశంలో ఎక్కడ మారథాన్ జరిగినా అందులో పాల్గొనడంతో పాటు వాటిని పూర్తి చేస్తూ రామకృష్ణ సత్తా చాటుతున్నారు.

భర్త మందలించాడని..



గీత మృతదేహం

చిత్తూరు అర్బన్: 'పిల్లల్ని ఊరికే తిట్టొద్దు' అని భర్త మందలించడంతో క్షణికావేశంలో భార్య గీత (30) ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్న ఘటన చిత్తూరు నగరం లోని శరవణపురంలో ఆదివారం చోటుచేసుకుంది. వన్‌టౌన్ సీఐ విశ్వనాథరెడ్డి కథనం మేరకు.. శరవణపురానికి చెందిన చిట్టిబాబు, గీతకు పెళ్లై ఇద్దరు పిల్లలున్నారు. ఇంట్లో ఉన్న పిల్లలు సరిగా చదవడం లేదని గీత దండించింది. ఈ సమయంలో పిల్లల్ని ఊరికే తిట్టొద్దు అని చిట్టిబాబు అనడంతో గీత ఆవేశంతో గదిలోకి వెళ్లి తలుపులు వేసుకుంది. గొడవ జరిగినప్పుడు గదిలోకి వెళ్లి తలుపు వేసుకోవడం అలవాటే కదా అనుకుని చిట్టిబాబు మౌనంగా ఉండిపోయాడు. కొద్దిసేపటి తరువాత తలుపులు తీయకపోవడంతో, అనుమానం వచ్చి పగులగొట్టి చూడగా ఫ్యాన్‌కు ఉరేసుకుని గీత మృతి చెంది ఉంది. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం చిత్తూరు ప్రభుత్వ ఆస్పత్రికి తరలించి, కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు.

తెలుగు వెలగాలి.. జాతి మురవాలి



- మాతృభాష దినోత్సవం రేపు

చిత్తూరు రూరల్: దేశభాషలందు తెలుగు లెస్స అని తెలుగు భాష ఔన్నత్యాన్ని చాటి చెప్పిన గొప్పకవి శ్రీకృష్ణదేవరాయలు. ప్రపంచంలో ఎన్నో భాషలున్నా తెలుగుకు ప్రత్యేక స్థానం ఉంది. కాలం మారుతున్న కొద్దీ అమ్మతో కష్టసుఖాలు చెప్పుకునే భాష నోటికి బరువైపోతోంది. కొత్త పదాల సృష్టి కరువైపోతోంది. ఒకప్పుడు ఆకాశమార్గాన ఉన్న భాషను నేలకు దించి సాహిత్యాన్ని సామాన్యులకు చేరదీసిన గిడుగు రామ్మూర్తి పంతులు జయంతి రేపు. భాష కోసం ఆయన చేసిన పోరాటాన్ని గుర్తు చేసుకుంటూ ఏటా ఆగస్టు 29న తెలుగు భాషా దినోత్సవం జరుపుకుంటున్నాం. ఆదిశగా తెలుగు భాషాభివృద్ధికి రాష్ట్ర ప్రభుత్వం సైతం కృషిచేస్తోంది.

ప్రభుత్వం ముందడుగు

తెలుగు భాష మాతృభాషగా మారుతోంది అన్న మాట వచ్చినప్పటి నుంచి పాఠశాలల్లోనూ తెలుగు భాషను సజీవంగా ఉంచే ప్రయత్నాలు చేస్తున్నారు. ఇందులో భాగంగా అధికారంలోకి వచ్చిన వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం మరో ముందడుగు వేసింది. మండలంలో ఉన్న ఉన్నత, ప్రాథమికోన్నత, ప్రాథమిక పాఠశాలల విద్యార్థులు, ఉపాధ్యాయులు కలిసికట్టుగా మండల విద్యాశాఖాధికారి ఎంపిక చేసిన పాఠశాలలో ఘనంగా తెలుగు భాషా దినోత్సవాన్ని జరపాలని ఆదేశాలున్నాయి. ఈ సందర్భంగా వేమన, సుమతీ శతకాలు వంటి పద్యధారణ, కవితలు, వ్యాసరచన, వక్తృత్వ పోటీలు, నృత్య పోటీలు నిర్వహించి ప్రోత్సాహకాలు అందించి, విద్యార్థులకు తెలుగు భాషపై మమకారం పెంచేందుకు కృషిచేయాలని నిర్ణయించుకుంది.

ప్రతిఒక్కరూ గుర్తించాలి



అతిపురాతన భాషగా ప్రసిద్ధి చెందిన తెలుగు భాష విశిష్టతను ప్రతి ఒక్కరూ గుర్తించాలి. మన దేశంలో అనేక జాతులు, వివిధ రకాల భాషలున్నాయి. ఈ భాషలన్నింటిలో తెలుగుభాష వైవిధ్యమైంది. కానీ ప్రస్తుత కాలమాన పరిస్థితుల్లో తెలుగు భాషకు ఆదరణ తగ్గుతోంది. తెలుగు భాషను కాపాడుకోవాల్సిన బాధ్యత అందరిపై ఉంది.

–లీలావతి, తెలుగు టీచర్, జెడ్పీ ఉన్నత పాఠశాల, తాళంబేడు

మాతృభాషను పరిరక్షించుకోవాలి



తెలుగు లోగిళ్లలో అమ్మభాషను పరిరక్షించుకోవడం మన కర్తవ్యం. మాతృభాషను తృణీకరించడమంటే మన కళ్లను మనమే పొడుచుకోవడం వంటిది. భవిష్యత్ తరాల నోట మకరందాల తేనె ఊట ఊరాలి. తెలుగును నిలబెట్టుకోవడమంటే మన జాతి ఘన వారసత్వ సంస్కృతి, మూలధనాన్ని పరిరక్షించుకోవడమేనని నా ఉద్దేశం. తెలుగు వెలుగులు విరజిమ్మాలి. మనమంతా ఆ దిశగా కృషిచేయాలి.

–రాజరత్నంరెడ్డి, ప్రజాహిత సేవా సంస్థ అధ్యక్షుడు, రిటైర్డ్ టీచర్

మాతృభాష గుర్తుండి పోవాలి



వెన్న కన్నా మెత్తనైన తెలుగు భాష వర్తమానంలో పతనావస్థ అంచులపై వేలాడుతోంది. తెలుగు వెలుగులు మసక బారకుండా చూడాల్సిన బాధ్యత ప్రతి తెలుగు వాడిపై ఉంది. తెలుగు భాషకు పట్టాభిషేకం చేసి వైభవ ప్రాభావాలతో కళకళలాడడానికి రాష్ట్ర ప్రభుత్వంతో పాటు తెలుగు భాషాభిమానులు, కవులు, రచయితలు కూడా ముందడుగు వేయాలి. తల్లిదండ్రులు మాతృభాషపై పిల్లలకు మమకారాన్ని పెంచాలి.

–కరణం విమల, నవ్యాంధ్ర రచయిత్రుల సంఘం అధ్యక్షురాలు

ప్రభుత్వ బడుల్లోనే తెలుగు వెలుగులు



బట్టీ పట్టే చదువుల వల్ల తెలుగు ధనం పడిపోయిందనే చెప్పాలి. అందుకే రాష్ట్ర ప్రభుత్వం ప్రభుత్వ బడులను బలోపేతం చేస్తోంది. బడులను కాపాడే ప్రయత్నంతో పాటు..మాతృభాషకు పట్టం కట్టింది. ప్రభుత్వ బడుల్లో చదివే పిల్లలకు తెలుగులోనే బోధనలు జరుగుతున్నాయి. తర్వాతనే ఆంగ్ల భాషను బోధిస్తున్నారు. మాతృభాష పరిరక్షణకు తల్లిదండ్రుల్లో మార్పు రావాలి.

–దీప, తెలుగు ఉపాధ్యాయిని, జెడ్పీ ఉన్నత పాఠశాల, తుమ్మింద

అలరించిన దుర్యోధన వధ ఘట్టం



దుర్యోధన వధ ఘట్టం సన్నివేశం

తవణంపల్లె: ముట్టుకూరులోని ద్రౌపదీ సమేత ధర్మరాజుల గుడిలో నిర్వహిస్తున్న మహాభారత యజ్ఞం కార్యక్రమంలో భాగంగా ఆదివారం సాయంత్రం దుర్యోధన వధ ఘట్టం అలరించింది. ముట్టుకూరులో వెలసియున్న ద్రౌపదీ సమేత ధర్మరాజుల గుడిలో ఈనెల 11నుంచి మహాభారత యజ్ఞం కార్యక్రమం జరుగుతోంది. ఇందులో భాగంగా ఆదివారం దుర్యోధన వధ సందర్భంగా మట్టితో భారీగా దుర్యోధనుడి విగ్రహం ఏర్పాటు చేశారు. ఉభయదారులచే ద్రౌపదీ దేవి, ధర్మరాజులు, భీముడు, అర్జునుడు, నకుల సహదేవుల విగ్రహాలకు అభిషేకం పూజలు నిర్వహించారు. అనంతరం దుర్యోధనుడు, భీముడు వేషధారణ వేసిన కళాకారులు మడుగులో దాగి ఉన్న దుర్యోధనుడిని బయటకు తీసుకొచ్చి వధించే ఘట్టం ప్రదర్శన ఆకట్టుకుంది. దుర్యోధనుడి మట్టి విగ్రహం మట్టికోసం భక్తులు పోటీపడి తీసుకెళ్లారు. సోమవారం ధర్మరాజు పట్టాభిషేకం కార్యక్రమం జరుగుతుందని నిర్వాహకులు బాబురెడ్డి తెలిపారు.

అర్హతే ప్రామాణికంగా పథకాలు



స్థానికులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే ఆరణి, మేయర్ అముద

- ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు

చిత్తూరు కార్పొరేషన్: గతంలో ఏ ప్రభుత్వం చేయని విధంగా అర్హతే ప్రామాణికంగా సంక్షేమ పథకాలు, అన్ని వర్గాల సంక్షేమమే ధ్యేయంగా జగనన్న పాలన సాగిస్తున్నారని ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు తెలిపారు. ఆదివారం స్థానిక 20వ డివిజన్ ఇరువారంలో మేయర్ అముదతో కలిసి గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో పాల్గొన్నారు. ఎమ్మెల్యే గడప గడపకు వెళ్లి సంక్షేమ పథకాల లబ్ధిని వివరించి బుక్‌లెట్లను అందజేశారు. విద్యకు ప్రథమ ప్రాధాన్యత ఇస్తూ అనేక సంక్షేమ పథకాలను రూపొందించినట్లు తెలిపారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ సమస్యలు తెలుసుకుని పరిష్కరించేందుకే గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆదేశాలతో నిర్వహిస్తున్నట్లు తెలిపారు. సంక్షేమ పాలన సాగిస్తున్న జగనన్నను మళ్లీ ఆశీర్వదించి ముఖ్యమంత్రి చేయాలని ఆయన ప్రజలను కోరారు. అనంతరం సచివాలయంలో ఉద్యోగులు, వలంటీర్లతో సమావేశమయ్యారు. డివిజన్‌లో ప్రధానంగా కాలువ, విద్యుత్ స్తంభాలు, వీధి దీపాలు, తాగునీటి సమస్యలు ఉన్నట్లు తమ దృష్టికి వచ్చిందన్నారు. వాటిని పరిష్కరించాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. డివిజన్ ఇన్‌చార్జ్ ప్రేమ్, చుడా చైర్మన్ పురుషోత్తంరెడ్డి, మార్కెట్ కమిటీ చైర్మన్ రాహుల్‌రెడ్డి, మొదలియార్ కార్పొరేషన్ డైరెక్టర్ జ్ఞానజగదీష్, కార్పొరేటర్ పూర్ణ, కోఆప్షన్ మెంబర్ కిరణ్, నేతలు రాజా, బాలసుబ్రమణ్యంరెడ్డి, శేఖర్, రిచర్డ్, మోహన్, దయాళ్, రాజు, వినోద్, బాలరాజు, శరత్ రెడ్డి, మహేష్‌బాబు, సతీష్, విక్కీ పాల్గొన్నారు.

నేడు గడప గడపకు..

30వ డివిజన్ లాలూగార్డెన్‌లో సోమవారం మధ్యాహ్నం 3 గంటలకు గడప గడపకు మన ప్రభుత్వం నిర్వహించనున్నారు. ఎమ్మెల్యే ఆరణి పాల్గొననున్నట్లు ఆయన కార్యాలయం తెలిపింది.

స్వచ్ఛమైన తాగునీరు అందించడమే లక్ష్యం



వెంగంపల్లెలో మినరల్ వాటర్ ప్లాంట్‌ను ప్రారంభిస్తున్న సుగుణాకర్‌రెడ్డి

తవణంపల్లె: ప్రజల ఆరోగ్యం పరిరక్షించాలనే లక్ష్యంతో తమ సొంత నిధులతో స్వచ్ఛమైన తాగునీరు అందించాలనే సంకల్పంతో పలు గ్రామాల్లో మినరల్ వాటర్ ప్లాంట్ల నిర్మాణానికి కృషిచేస్తున్నట్లు దాత, అర్ధగిరి ట్రస్టు బోర్డు మాజీ చైర్మన్ పైమాఘం సుగుణాకర్‌రెడ్డి తెలిపారు. ఆదివారం మండలంలోని వెంగంపల్లెలో వైఎస్సార్‌సీపీ నేతలు, మాజీ సైనికులు దివంగత లాల్‌బహదూర్‌రెడ్డి జ్ఞాపకార్థం గ్రామస్తుల సహకారంతో ఏర్పాటు చేసిన మినరల్ వాటర్ ప్లాంట్‌ను దాత సుగుణాకర్ రెడ్డి చేతుల మీదుగా ప్లాంట్‌ను ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ పూతలపట్టు నియోజకవర్గంలో 11 మినరల్ వాటర్ ప్లాంట్లను ఏర్పాటు చేస్తున్నట్లు వెల్లడించారు. రెండు ప్లాంట్లు పూర్తి చేసి ప్రజలకు తాగునీరు అందిస్తున్నామన్నారు. వెంగంపల్లె సర్పంచ్ ఎస్.రాజేశ్వరి, వైస్ ఎంపీపీ పట్నం ప్రతాప్‌రెడ్డి, వైఎస్సార్‌సీపీ రాష్ట్ర సంయుక్త కార్యదర్శి సురేష్ బాబురెడ్డి, మండల పార్టీ కన్వీనర్లు సి. హరి రెడ్డి, బుజ్జిరెడ్డి, నేతలు కిషోర్‌రెడ్డి, కరీం, రవిరెడ్డి, మధుకుమార్, హరిప్రసాద్‌రెడ్డి, ప్రకాష్‌బాబురెడ్డి, విజయభాస్కర్‌రెడ్డి, భాస్కర్‌రెడ్డి, మహేష్‌రెడ్డి, చంద్రమోహన్‌రెడ్డి, కిషోర్‌కుమార్‌రెడ్డి, బాబా కిషోర్ రెడ్డి, ప్రార్థసారథిరెడ్డి సందీప్‌రెడ్డి, మధుసూదన్ రెడ్డి పాల్గొన్నారు.

బాలుడు అదృశ్యం.. బెంగళూరులో ప్రత్యక్షం

చిత్తూరు అర్బన్: చిత్తూరు నగరంలో ఇంటర్ విద్యార్థి ప్రణవ్ సాయి (15) అదృశ్యమై బెంగళూరులో ప్రత్యక్షమాయ్యడు. స్థానిక రామ్‌నగర్ కాలనీకి చెందిన గణపతి కుమారుడు ప్రణవ్‌సాయి ఓ ప్రైవేటు కళాశాలలో ఇంటర్ మొదటి సంవత్సరం చదువుతున్నాడు. శనివారం స్నేహితుడి ఇంటికి వెళుతున్నట్లు ఇంటి నుంచి బయలుదేరి వెళ్లి మళ్లీ రాలేదు. పలు చోట్ల వెతికినా ఆచూకీ లభ్యం కాకపోవడంతో కుటుంబసభ్యులు ఆదివారం పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈక్రమంలో బెంగళూరులో ప్రణవ్ సాయిని అక్కడ వారి బంధువులు గుర్తించి అతన్ని తీసుకుని ఆదివారం రాత్రి చిత్తూరుకు బయలుదేరారు.

పట్టణ పరిధిలో ఏర్పాటు చేసిన స్వాగత తోరణాలు



పట్టణంలో కళకళలాడుతున్న ఫ్లెక్సీలు, పార్టీ జెండాలు





నీ రాకకై..

సంక్షేమ సారథి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి తొలిసారి ముఖ్యమంత్రి హోదాలో నగరికి విచ్చేస్తుండడంతో పండుగ వాతావరణం నెలకొంది. గత ఎన్నికల్లో ఇచ్చిన అన్ని హామీలను అమలు చేసి ప్రజా సంక్షేమమే లక్ష్యంగా పాలన సాగిస్తున్న సీఎం జగన్ రాకకై జిల్లా ప్రజానీకం వెయ్యికళ్లతో ఎదురుచూస్తోంది. ఎటు చూసినా జైజగన్ నినాదాలు మార్మోగుతున్నాయి. రావాలి జగన్.. కావాలి జగన్ పాట మైకుల్లో హోరెత్తుతోంది. నగరి పట్టణమంతా ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డికి స్వాగతం పలకడానికి ఏర్పాటు చేసిన స్వాగత తోరణాలు, భారీ ఫ్లెక్సీలు, ఆకాశంలో ఎగిరే బెలూన్లు, రెపరెపలాడే పార్టీ జెండాలతో నీలివర్ణంతో శోభిల్లుతోంది.





ఏర్పాటైన సభావేదిక, (ఇన్‌సెట్) హెలిప్యాడ్‌ను పరిశీలిస్తున్న మంత్రులు, ఎంపీలు, అధికారులు

- నేడు నగరిలో సీఎం జగన్‌మోహన్‌రెడ్డి పర్యటన
- మార్మోగుతున్న జైజగన్ నినాదం
- నభూతో నభవిష్యత్ అనేలా ఏర్పాట్లు
- బ్రహ్మరథం పట్టేందుకు నగరి ప్రజానీకం ఎదురుచూపులు
- జగనన్న విద్యాకానుక 5వ విడతను లాంఛనంగా ప్రారంభించనున్న సీఎం జగన్

నగరి: రాజు బాగుంటే రాజ్యం బాగుంటుందన్న నానుడి మరోసారి నిజమనేలా ప్రకృతి సైతం సంక్షేమ సాధకుడు సీఎం జగన్‌మోహన్‌రెడ్డికి స్వాగతం పలికేందుకు సిద్ధమైంది. నిన్నటివరకు ఉక్కపోతతో ఇబ్బంది పడిన జనం వరుణుడు కరుణ చూపడంతో చిరుజల్లులు పడ్డాయి. దీంతో వాతావరణం ఒక్కసారిగా చల్లబడింది. వరుణుడు సైతం సీఎం జగన్‌కు ఆహ్వానం పలుకుతూ చల్లదనంతో నింపాడు. భవిష్యత్ తరాలకు భరోసా కల్పించాలన్నదే సీఎం జగన్ మోహన్‌రెడ్డి అభిమతం.

విద్య, వైద్య రంగాల అభివృద్ధికి ప్రత్యేక కృషి చేస్తున్న విషయం విదితమే. అందులో భాగంగా జగనన్న విద్యాకానుక 5వ విడతను నగరిలో సోమవారం లాంఛనంగా ప్రారంభించనున్నారు. దీంతో స్థానిక ప్రజల్లో ఆనందోత్సాహంతో ఎదురుచూస్తున్నారు.

సర్వం సిద్ధం..

సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పర్యటనకు సర్వం సిద్ధమైంది. నగరిలో సోమవారం అట్టహాసంగా జరగనున్న జగనన్న విద్యాదీవెనను లాంఛనంగా ప్రారంభించడానికి సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి పాల్గొంటున్న విషయం తెలిసిందే. దీనికి అవసరమైన అన్ని ఏర్పాట్లను జిల్లా అధికార యంత్రాంగం పూర్తి చేసింది. ఆదివారం నగరిలో ఏర్పాట్లు జరుగుతున్న తీరును డెప్యూటీ సీఎం నారాయణస్వామి, రాష్ట్ర అటవీ, విద్యుత్, పర్యావరణ శాస్త్ర సాంకేతిక భూగర్భ గనుల శాఖ మంత్రి డాక్టర్ పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి, రాష్ట్ర సాంస్కృతిక, యువజన అభివృద్ధి శాఖ మంత్రి ఆర్‌కే రోజా, ఎంపీలు మిథున్‌రెడ్డి, రెడ్డెప్ప, సీఎం కార్యక్రమాల సమన్వయకర్త తలశిల రఘురాం జిల్లా కలెక్టర్ ఎస్.షణ్మోహన్, ఎస్పీ వై.రిశాంత్ రెడ్డి, ఇతర జిల్లా ఉన్నతాధికారులతో కలిసి పర్యవేక్షించారు. సభాప్రాంగణాన్ని, హెలిప్యాడ్‌లను, ఏర్పాటుచేసిన గ్యాలరీలను పరిశీలించారు. ముఖ్యమంత్రి హోదాలో నగరికి తొలిసారి వస్తున్న జగన్‌మోహన్‌రెడ్డి సభను నభూతో న భవిష్యత్ అనేస్థాయిలో నిర్వహించేందుకు ప్రజా ప్రతినిధులు విశేషంగా కృషిచేస్తున్నారు. సభకు భారీగా ప్రజలు రానున్నందున వారికి ఏ ఇబ్బంది కలుగకుండా అన్నిచర్యలు చేపట్టారు. ఏరియా ఆస్పత్రిలో వీవీపీ వార్డులను సిద్ధం చేశారు.

సిద్ధమైన సభావేదిక..

నగరి, పుత్తూరు మార్గం షిరిడీసాయి దివ్య ధామం సమీపంలో ఏర్పాటు చేసిన బహిరంగ సభా వేదిక అందంగా ముస్తాబైంది. జిల్లావ్యాప్తంగా వచ్చే ప్రజలు, విద్యార్థులు, తల్లిదండ్రులు కూర్చునేందుకు వీలుగా అధికారులు సర్వం సిద్ధం చేశారు. ద్విచక్రవాహనాలు, పెద్ద వాహనాల పార్కింగ్‌కు స్థలాలను కేటాయించారు.

జగనన్నకు ఘనస్వాగతం పలుకుదాం..



నగరి పట్టణానికి విచ్చేస్తున్న ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డికి కనీవినీ ఎరుగని రీతిలో స్వాగతం పలుకుదామని మంత్రి ఆర్‌కే రోజా జిల్లా ప్రజలకు పిలుపునిచ్చారు. ముఖ్యమంత్రిగా నగరికి తొలిసారి విచ్చేస్తున్న ముఖ్యమంత్రిని సాదరంగా ఆహ్వానిద్దామన్నారు. నియోజకవర్గంలో అభివృద్ధి పనులకు అడిగిందే తడవుగా నిధులు మంజూరు చేసిన వరాలరేడు, నవరత్నాల పథకాల ద్వారా ప్రజలకు ఆర్థిక భరోసా కల్పించిన సంక్షేమ సారథి విద్యాదీవెన పథకాన్ని లాంఛనంగా ప్రారంభించడానికి నగరికి విచ్చేస్తున్నారని, ఆయనకు మన ప్రేమ, అభిమానాలతో ఘన స్వాగతం పలుకుదామన్నారు.

పటిష్ట బందోబస్తు..



పోలీసులకు సూచనలిస్తున్న ఎస్పీ రిషాంత్ రెడ్డి

సీఎం పర్యటన నిమిత్తం పటిష్ట బందోబస్తు ఏర్పాటు చేశారు. సీఎం పర్యటన నిమిత్తం విధి నిర్వహణకు విచ్చేసిన పోలీసులకు స్థానిక డిగ్రీ కళాశాల మైదానంలో ఎస్పీ రిషాంత్ రెడ్డి సూచనలు అందించి విధులను కేటాయించారు. హెలిప్యాడ్‌కు విచ్చేసే హెలికాప్టర్, ముఖ్యమంత్రి కాన్వాయ్‌లను ట్రయల్ రన్ నిర్వహించారు.



హెలికాప్టర్ ట్రయల్‌రన్



కాన్వాయ్ ట్రయల్‌రన్



బహిరంగ సభకు విచ్చేసే ప్రజలు కూర్చోవడానికి సిద్ధమైన గ్యాలరీలు